# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 02-02-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్ - ఇండోనేషియాల మధ్య కేవలం భౌగోళిక సంబంధలే కాకుండా వేల సంవత్సరాల ఆధ్యాత్మిక సంబంధం కూడా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు.
- ❖ ప్రయాగ్‌రాజ్ లో జరుగుతున్న కుంభమేళాలో బసంత్ పంచమి నాడు అమృత స్నానం సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది.
- ❖ ఢిల్లీ ఎన్నికల నేపధ్యంలో ఈరోజు ఆర్ కె పురంలో జరిగిన బహిరంగ సభలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగించారు.
- ❖ మహిళల అండర్ 19 టీ20 ప్రపంచ కప్-2025 విజేతగా భారత్ నిలిచింది.

================================

భారత్ - ఇండోనేషియాల మధ్య కేవలం భౌగోళిక సంబంధలే కాకుండా వేల సంవత్సరాల ఆధ్యాత్మిక సంబంధం కూడా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. జకార్తాలోని శ్రీ సనాతన ధర్మ ఆలయం మహా కుంభాభిషేక కార్యక్రమంలో ప్రధానమంత్రి ఈరోజు దృశ్యమాధ్యమ విధానంలో పాల్గొన్నారు. ఆలయ ప్రారంభోత్సవాన్ని ఒక స్మారక మైలురాయిగా ఆయన కొనియాడారు. ఈ ఆలయాన్ని ఆధ్యాత్మికత, సంస్కృతి, ఐక్యతకు ధీటుగా ప్రధనామంత్రి అభివర్ణిస్తూ…

(వాయిస్ 35 సెకన్లు)

================================

వసంత పంచమి పండుగ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. విద్య, జ్ఞానంతో ముడిపడి ఉన్న సంతోషకరమైన సందర్భం దేశంలోని పౌరులందరికీ ఆనందం, శ్రేయస్సు, జ్ఞానాన్ని తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నట్లు రాష్ట్రపతి సామాజిక మాధ్యమం వేదికగా తెలిపారు. భారతదేశాన్ని ప్రపంచ విజ్ఞాన కేంద్రంగా స్థాపించాలని రాష్ట్రపతి పేర్కొన్నారు.

================================

ప్రయాగ్‌రాజ్ లో జరుగుతున్న మహా కుంభమేళాలో వసంత పంచమి నాడు అమృత స్నానం సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. వివిధ రైల్వే స్టేషన్‌ల నుండి 400 కంటే ఎక్కువ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నామని రైల్వే శాఖ ఒక ప్రకటలో తెలిపింది. నార్త్ సెంట్రల్ రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి శశికాంత్ త్రిపాఠి మాట్లాడుతూ.. భక్తులకు వైద్యసేవలు అందించేందుకు అన్ని రైల్వే స్టేషన్ల ప్రాంగణాల్లో పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రయాగ్‌రాజ్ జంక్షన్‌తో పాటు మరో 8 రైల్వే స్టేషన్లలో వైద్యులు, పారామెడికల్ సిబ్బందితో కూడిన మొత్తం 32 వైద్య కేంద్రాలు పని చేస్తున్నాయని ఆయన వివరించారు.

================================

మహాకుంభమేళాలో వసంత పంచమి నాడు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారు. మౌని అమావాస్య రోజున చోటుచేసుకున్న తొక్కిసలాటతో నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు. ఈరోజు మధ్యాహ్నం 12 గంటల వరకు 90 లక్షల మంది భక్తులు స్నానాలు ఆచరించారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. మరోవైపు కుంభమేళాకు ప్రముఖుల తాకిడి పెరుగుతోంది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఇప్పటికే ప్రయాగ్‌రాజ్‌కు వచ్చివెళ్లగా.. ఈనెల 5వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

================================

ఢిల్లీ శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఈరోజు ఆర్.కె.పురంలో జరిగిన బహిరంగ సభలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగించారు. ర్యాలీ సందర్భంగా, ఆమ్ ఆద్మీ పార్టీ గత 11 సంవత్సరాలు ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని అన్నారు. మరోవైపు ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ఢిల్లీలోని వివిధ ప్రాంతాల్లో రోడ్ షోలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఢిల్లీలోని పలు నియోజకవర్గాల ప్రచార సభలలో పాల్గొన్నారు. 70 మంది సభ్యులున్న ఢిల్లీ శాసనసభకు బుధవారం ఎన్నికలు జరగనుండగా, ఈ నెల 8న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

================================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ చేరుకున్నారు. ఢిల్లీ విమానాశ్రయంలో ఆయనకు.. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తెలుగుదేశం పార్టీ పార్లమెంటు సభ్యులు స్వాగతం పలికారు. ఢిల్లీ ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల తరఫున చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. ప్రచారంలో భాగంగా షాద్ర ప్రాంతంలో ఆయన తెలుగు వారితో భేటీ కానున్నారు.

విరామం

================================

ఇజ్రాయెల్ నూతన సైన్యాధిపతిగా మాజీ మేజర్ జనరల్ ఇయల్ జమీర్ నియమితులయ్యారు. ఈమేరకు దేశ అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ నియమకాన్ని ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు రక్షణ మంత్రి కాట్జ్‌లు సంయుక్తంగా చేశారని ప్రధానమంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. 2023 అక్టోబరు 7న జరిగిన మిలిటెంట్ సంస్థ దాడిని నిరోధించడంలో భద్రతా వైఫల్యానికి బాధ్యత వహిస్తూ.. ఇజ్రాయెల్ సైన్యాధిపతి లెఫ్టినెంట్ జనరల్ హెర్జి హలేవీ ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు. మార్చి 6న తాను బాధ్యతల నుంచి వైదొలుగుతున్నట్లు ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈక్రమంలోనే ఇజ్రాయెల్ తన కొత్త సైన్యాధిపతిని ప్రకటించింది.

==============================

ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ లో అమృత్ ఉద్యానవనాన్ని ప్రజల సందర్శనార్థం ఈ రోజు నుంచి మార్చి 30వ తేదీ వరకు తెరచి ఉంచానున్నట్లు రాష్ట్రపతి భవన్ వెల్లడించింది. సోమవారం మినహా వారంలో 6 రోజులు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సందర్శించవచ్చని పేర్కొంది. తులిప్ పుష్పాలతో పాటు 140 రకాల గులాబీలు, 80 రకాల ఇతర పూలను ఈ ఉద్యానవనంలో ఉచితంగా వీక్షించవచ్చు. రాష్ట్రపతి భవన్ లో మార్చి 6 నుంచి 9వ తేదీ వరకు వివిద్ ధ కా అమృత్ మహోత్సవ్ నిర్వహిస్తారు.

==============================

దేశీయ ఆర్థిక వృద్ధి కారణంగా గత నెలలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) ఆదాయం 12.3 శాతం పెరిగి లక్షా 96 వేల కోట్లకు చేరింది. ఇందులో దేశీయ లావాదేవీలతో సమకూరిన జీఎస్టీ 10.4 శాతం పెరిగి లక్షా 47 వేల కోట్ల రూపాయలకు చేరగా.. దిగుమతి వస్తువులపై విధించిన పన్నుల నుంచి ఆదాయం 19.8 శాతం పెరిగి 48 వేల 382 కోట్ల రూపాయలకు చేరింది. ఈ సంవత్సరం జనవరిలో మొత్తంగా జీఎస్టీ ఆదాయం 1 లక్షా 95 వేల 506 కోట్ల రూపాయలు ఉండగా... గతేడాదితో పోలిస్తే 12.3 శాతం పెరిగింది.

==============================

జపాన్ అంతరిక్ష సంస్థ తన కొత్త H-3 రాకెట్‌లో నావిగేషన్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిందని ఈరోజు ప్రకటించింది. నైరుతి జపాన్ ద్వీపంలోని తనేగాషిమా అంతరిక్ష కేంద్రం నుండి ఈ ప్రయోగాన్ని చేపట్టారు. దాదాపు రెండు వారాల్లో ఇది లక్ష్య భూగోళ కక్ష్యకు చేరుకుంటుందని అధికారులు తెలిపారు. జపాన్ ప్రస్తుతం క్వాసి-జెనిత్ శాటిలైట్ సిస్టమ్ కలిగి ఉంది. ప్రాంతీయ నావిగేషన్ సిస్టమ్ కోసం 4 ఉపగ్రహాలు 2018లో మొదటిసారిగా అమలులోకి వచ్చాయి. ప్రస్తుత ఉపగ్రహం దాని నెట్‌వర్క్ లో ఐదవది.

==============================

డెహ్రాడూన్‌లో జరుగుతున్న 38వ జాతీయ క్రీడల్లో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకునే క్రమంలో మధ్యప్రదేశ్‌కు చెందిన షూటర్ ఆషి చౌక్సే మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ లో జాతీయ రికార్డును నెలకొల్పింది. 2023లో హాంగ్‌జౌ ఆసియా క్రీడలలో 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్‌లలో రజతం, 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో రజతం సాధించిన 22 సంవత్సరాల చౌక్సే ప్రస్తుతం 598 పాయింట్లు సాధించి, 2023లో సిఫ్ట్ కౌర్ సమ్రా నెలకొల్పిన 594 రికార్డును అధిగమించింది.

==============================

మహిళల అండర్ 19 టీ20 క్రికెట్ ప్రపంచ కప్-2025 విజేతగా భారత్ నిలిచింది. కౌలాలంపూర్ వేదికగా జరిగిన ఫైనల్లో దక్షిణాఫ్రికాను 9 వికెట్ల తేడాతో ఓడించిన భారత జట్టు.. వరుసగా రెండవ సారి అండర్-19 ప్రపంచ కప్ టైటిల్‌ను అందుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 82 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన భారత జట్టు లక్ష్యాన్ని ఒక్క వికెట్ కోల్పోయి 11.2 ఓవర్లలో చేరుకుంది.

==============================
==============================